వేకలంక
సరళ

తిప్పు

వీధి వాకిలి ముందు ఇరుగు పొరుగు పిల్లలతో ఆడుకుంటున్న మనుమరాలు అరుణని చూస్తూ కూచుంది కామాక్షమ్మ. మెట్లమీద కూచుని గోడకి జేరగిలబడి కాళ్లు బారచాపి ఒకసారి చేతులు విరుచుకుని 'అమ్మా' అనుకుంది. ఏమిటో ఈ చేతుల నొప్పులు! 'వయసులో ఉన్నప్పుడు ఇలాటి నొప్పులు వస్తే ఓర్చుకునే శక్తి ఉండేదేమో గాని ఇప్పుడు బొత్తిగా ఏ చిన్న బాధ వచ్చినా ఓర్చుకోలేక పోతున్నాను. అయినా నా పిచ్చిగాని, వయసులో ఉన్నప్పుడు ఇలాటి నొప్పులుఎందుకు వస్తాయి?' ఆలోచనలు అడ్డ దిడ్డంగా పరిగెడుతూ ఉంటే వాటిని అదుపులోపెట్టడానికి ప్రయత్నించింది . కాని కుదరలేదు. ముఖ్యంగా అస్తవ్యస్తంగా ఉన్న కూతురి జీవితం ఆమెను కలవర పెట్టింది. మెట్లమీద నించి జారే బంతిలాగ మళ్లీ మళ్లీ తన ఆలోచనలు గతంలోకి జారుతూంటే ఏమీ చేయలేని అసహాయ స్థితిలో అలాగే స్థాణువులా ఉండి పోయింది కామాక్షమ్మ. ఎందుకంటే , గతం- అదే యాభైయైదేళ్ల ఆమె గతంలో- సంతోషంగా గడిపిన క్షణాలు అతి తక్కువ. ఆ జ్ఞాపకాలు వచ్చి ఆమె వేదనను ద్విగుణీకృతం చేశాయి. అయినా మరచి పోదలుచుకున్నా మరపురాక బాధపడటం తప్పలేదు ఆమెకు.

" అమ్మమ్మా ! ఆకాశంలో చూడు! నీలం పందిరి నిండా బల్బులు వెలుగుతున్నాయి. దేవుళ్లు సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఎవరిదో బర్త్‌డే అనుకుంటున్నారు!" అన్నది అరుణ తన దగ్గరకి వచ్చి.

"అబ్బా , అప్పుడే చీకటి పడిందే! పద ఇంట్లోకి వెళ్దాం" అని అరుణ చెయ్యి పట్టుకు లేచింది కామాక్షమ్మ.

..... చిన్నప్పుడు తనూ ఇలాగే వాళ్లమ్మతో 'అమ్మా, ఆకాశం నిండా ప్రమిదలు వెలిగించారే, దీపావళి చేసుకుంటున్నారు దేవతలు' అనేది. ఆ కాలంలో ఎలక్ట్రిక్ దీపాలు వాళ్లింట్లో, వాళ్ల ఊళ్లో కూడా ఉండేవి కావు. కాలం మారింది కాలంతో పాటు అలవాట్లూ, ఆచారాలు, అభిప్రాయాలూ అన్నీ మారి పోయాయి. ఈకాలం పిల్లలకి లోకజ్ఞానం ఎక్కువ. ఏడేళ్ల అరుణకి ఇప్పుడు తెలిసినన్ని విషయాలు తనకి ముప్పై సంవత్సరాలు నిండినప్పుడు కూడా తెలిసేవి కావు. టి.వి. వల్ల పిల్లలుపాడై పోతారన్న వాదం ఎలా ఉన్నా అరుణ విషయంలో మాత్రం టి.వి. జ్ఞానబోధిని అనవచ్చును. ఎన్నోవిషయాలు చూసి గ్రహించి ఆ చిన్న మస్తిష్కంలో ఇముడ్చుకుని అప్పుడప్పుడు వెలిబుచ్చి కామాక్షమ్మని ఆశ్చర్యంలో ముంచేస్తుంది అరుణ.

'అమ్మమ్మా చూశావా ఈ వింత!' అన్నది అరుణ ఒకరోజు.

'నేనెక్కడ చూస్తానమ్మా! నువ్వే చెప్పు ఆ వింతేమిటో!'

'ఆకులలోంచి పెట్రోలు లాంటిది తయారు చేశాడట ఒకతను!.'

"అలాగా! నీకెలా తెలుసు?"

"టి.వి.లో చూపించారు కదా అమ్మమ్మా!

నీకేం తెలియదు'' అని నవ్వింది అరుణ.

కామాక్షమ్మ చిన్న తనంలో టి.వి. లేదు. రేడియో ఉండేది గాని అది నాన్నగారు వార్తలు వినడానికి, అమ్మ శాస్త్రీయ సంగీతం వినడానికి మాత్రమే ఉపయోగించేవారు. సినిమాలు తక్కువగా ఉండేవి. ఉన్నా పిల్లలని పంపేవారు కారు. స్కూలు, ఇల్లు తప్ప వేరే ప్రపంచం తెలియదు. తన చిన్నతనంలో కలిగిన ఇంటి పిల్లలు సినిమా చూశామని స్కూలులో గొప్పగా చెప్పుకుంటే వినేది ఆశ్చర్యంగా. లోకజ్ఞానం అంటే తల్లి వరకే.

..... ఆకాశంలో మబ్బు తునకలు అర్థం పర్థం లేకుండా అటూ ఇటూ పరిగెత్తినట్టు తన ఆలోచనావీచికలు కూడా పిచ్చిపిచ్చిగా పరిగెడుతూంటే వాటిని ఆపలేక, అణచలేక, సతమతమయ్యేది కామాక్షమ్మ. ఎందుకో అరుణ మాట్లాడినప్పుడల్లా తన గతాన్ని కదిలించేది. అరుణకి తల్లీ, తండ్రీ, అమ్మమ్మల తోడిదే లోకం. స్కూలుకి వెళ్లినప్పుడు అక్కడ పిల్లలతో చాలా కలివిడిగా, సరదాగా తిరుగుతూ ఉండే అరుణ అంటే టీచర్లకీ, తోటి పిల్లలకీ కూడా ప్రేమే. తల్లీ తండ్రీ తన మాటలు వినకపోతే అమ్మమ్మే అరుణకి నిత్య శ్రోత.

"దా అమ్మా బువ్వ తిందువుగాని'' అని కామాక్షమ్మ వంటింట్లో నించి కేకేసింది.

"వస్తున్నా అమ్మమ్మా. అయినా బువ్వ ఏమిటి? నే నింకా చిన్న పిల్లనా? నాకు ఏడేళ్లు తెలుసా? అన్నం తినడానికి రా అని పిలు అమ్మమ్మా!'' అన్నది అరుణ.

నిజమే, తన కంటికి తన కూతురే ఇంకా చిన్న పిల్ల, కూతురికి కూతురు మరీ పసికందు లాగా కనిపించడం సహజమే. కాని వాళ్లిద్దరూ తన కంటే ఎంతో ఎత్తు ఎదిగిపోయారు. తనే ఇంకా ఉన్న చోటే ఉండి పోయిందేమో!

"కూతురు కరుణ ఆఫీసు నించి వచ్చేసి నట్టుంది. వాళ్ల గదిలోనించి కంఠాలు విన బడుతున్నాయి. కూతురూ, అల్లుడూ ఘర్షణ పడుతున్నట్టు తెలుస్తోంది. రోజూ ఇదే కార్యక్రమం అల్లుడు ఏ ఉద్యోగానికీ వెళ్లడు. అతని దృష్టిలో అతను గొప్ప కళాకారుడు. ప్రపంచం అతని ఘనత ఇంకా గుర్తించలేదు. ఏమాత్రం తెలిసినా మ్యూజిక్ డైరెక్టర్లు ఈపాటికి ఎస్.పి. బాల సుబ్రహ్మణ్యాన్ని తీసేసి ఇతని చేతే పాటలు పాడించుకునేవాళ్లు అని అతని అభిప్రాయం. అది తన మనసులో ఉంచుకోకుండా నలుగురితో అంటాడు కూడాను. ఈ తత్వం కరుణకి నచ్చదు. అసలు సంగీతం ద్వారానే ఇద్దరూ కలుసు కోవడం, ప్రేమించుకోవడం, అది వివాహానికి దారి తీయడం జరిగాయి. అయితే కరుణకు వచ్చినన్ని అవకాశాలు అతనికి రాక పోవడంతో అతని అత్మన్యూనతా భావం క్రమేపీ ఎక్కువవడం, ఫలితంగా కరుణని సూటిపోటి మాటలనడం పరిపాటి అయిపోయి, అదే ఒక దినచర్యగా మారింది. కరుణ పాట కచేరీలు చెయ్యడమేకాక ఉద్యోగంలో కూడా చేరింది. ఆర్థిక ఒత్తిడులు ఒక కారణమైనా ముఖ్యంగా భర్తనుండి వీలైనంత సేపు దూరంగా ఉంటేనే మనసుకు శాంతి అనుకునేది కరుణ. ఇంట్లో ఉంటే ఘర్షణలు తప్పవు. ప్రేమా దోమా ఎప్పుడో హరించిపోయాయి. ప్రస్తుతం వారిద్దరి మధ్య అనుబంధం కూతురు అరుణ ఒక్కతే.

వీళ్లిద్దరూ వివాహం చేసుకుందామని తీర్మానించుకుని తనతో కూతురు ఈ మాట చెప్పినప్పుడు కామాక్షమ్మ అన్నది, " నీ భవిష్యత్తు మలుచుకునే అధికారం నీ కున్నది గాని అతని కుటుంబ పరిస్థితులూ, పుట్టుపూర్వోత్తరాలూ ఏమైనా వాకబు చేసి తెలుసు కుంటే మంచిదేమో.' తన కూతురు తన మాటలకి ఎలా స్పందిస్తుందో తెలుసు కనక కాస్త బెరుకుగానే అన్నది ఈ మాటలను.

"నీ పెళ్లి చేశారుగా అమ్మమ్మా తాతయ్యా అన్నీ చూసి! ఏమయింది? నాకు నమ్మకం లేదమ్మా వీటిలో. అయినా సరిగ్గా సంసారం"చేసే తెలివి తేటలు నీకుండి ఉంటే నాన్న ఇలా పరారి అయుండేవాడు కాదు. నాన్న తప్పేమీ లేదు. ఇందులో నీకే ఏమీ తెలియదు" అన్నది కరుణ కటువుగా. తను అడిగిందేమిటి? కరుణ చెప్పిన జవాబేమిటి? వాళ్ల నాన్న పరారయి పోవడాని కారణం అతని మానసిక దౌర్బల్యం కాదా? తన చేతకానితనమా అది? ఎవరికి చెప్తుంది తను! కరుణ దృష్టిలో తన తండ్రి నిర్దోషి. సంసారం నిలబెట్టుకోడం వాళ్ల వాళ్ల చేతుల్లో ఉంటుంది. గాని ఈ పొంతనాల వల్ల కాదు అని అంటుంది. కరుణ. మరి తన సంసారం ఇలా నడి వీధి పాలవుతూంటే నిలబెట్టుకోదేం! తన మాటలు తనకైతే వర్తించవా? ఎప్పటికైనా తండ్రిని వెతికి తెస్తానంటుంది కరుణ. రానీ, అతడు వస్తే వాస్తవం కరుణకి తెలుస్తుంది.

కామాక్షమ్మ వంటకాలు డైనింగ్ టేబిల్ మీద పెట్టి వంట ఇల్లు సర్ది తన గదిలోకి వస్తూండగా అరుణ, చేతిలో తలగడతో తన దగ్గరికి వచ్చింది.

"అమ్మమ్మా, అమ్మా నాన్నా మళ్లీ పోట్లాడుకుంటున్నారు. నేను నీ దగ్గరే పడుకుంటా" అన్నది.

"లేదమ్మా, వాళ్లు పోట్లాడడంలేదు ఏవో పెద్దవాళ్ల విషయాలు మాట్లాడుకుంటున్నారు. నీ కెక్కడ యిష్టం ఉంటే అక్కడే పడుకో" అన్నది కామాక్షమ్మ.

ఎన్నాళ్లని ఇలా బులిపించగలదు అరుణ ని? అరుణ మాత్రం ఇలాటి మాటలు నమ్ముతుందా? అరుణ చాలా తెలివి గలది. మొన్నీ మధ్య ఎవరింటికో బారసాలకి వెళ్తే అరుణ చటుక్కున ఆ ఇల్లాలిని అడిగింది. "మీకు పెళ్లైన ఏడాదికే పాపాయి పుట్టిందా ఆంటీ?" అని అసందర్భంగా ఇలా అనగానే కామాక్షమ్మ ముఖం వెల వెలపోయింది. కాని ఆ ఇల్లాలు చలించకుండా "అవును పాపా నీకెలా తెలిసింది!" అని అడిగింది చిరునవ్వుతో.



టి.విలో చెప్పారుగా ఆంటీ అన్నది అరుణ ఇంకా అక్కడ ఉండడం ఆరోగ్యకరం కాదని అరుణని తీసుకుని ఇంటికి తిరిగి వచ్చేసింది కామాక్షమ్మ.

అరుణని మందలిద్దామనుకుంది కామాక్షమ్మ. కానీ ఎవరినీ మందలించే శక్తి, శాసించే ధైర్యం కామాక్షమ్మకి ఏనాడూ లేవు. కనుకనే తన జీవితం ఇలా నాశనమయింది అన్న విషయం తను గ్రహించక పోలేదు. తన అసమర్థతే తనని ఈ స్థితికి తెచ్చింది అని తెలుసు తనకి. ఇంటికి వచ్చాక! "పాపా పెద్దవాళ్లతో అలా అనవచ్చా! తప్పుకదూ!" అరుణతో అన్నది.

'కాదు అమ్మమ్మా. టి.వి.లో చూపారుగా ఒక పెళ్లిలో ఫ్రెండ్ గిఫ్ట్ ఇస్తూ పైఏడు మీరు నాకు గిఫ్ట్ ఇవ్వాలి ఒకబాబుని అన్నాడుగా!అందుకనేఅడిగాను' అన్నది అమాయకంగా అరుణ.

"అమ్మమ్మా పాపాయిల్ని దేవుడు ఇవ్వడు. పెళ్లి చేసుకున్న ఆంటీలకి పొట్టలో పాపాయి తయారవుతుంది. నాకు తెలీదనుకోకు. నీకే ఏం తెలీదు అమ్మమ్మా."

'నీకేం తెలీదు.' ఎంతమంది ఎన్ని సందర్భాలలో అన్నారో తనతో ఈ వాక్యం! తల్లి దండ్రులు, కూతురు, ఇప్పుడు తన మనుమరాలు- నిజమే. తనకేం తెలీదు. తెలిస్తే తన బ్రతుకిలా మట్టి పాలై ఉండేదా! విధిని దూషించాలా, తనకు జన్మనిచ్చిన తల్లి తండ్రులనా? ఈ పరిస్థితికి కేవలం తానే కారకురాలు తన అసమర్థత, తన మెత్తదనం, తన అమాయకత్వం.

దశ విధ పొంతనాలు చూసి చేసిన వివాహం తనది. మధ్య తరగతి కుటుంబమైనా ఒడిదుడుకులు లేకుండా సాగింది. ప్రభుత్వోద్యోగి అయిన తన భర్త తెచ్చే జీతంతో సుఖంగానే సంసారం నెట్టుకు వచ్చింది. కరుణ పుట్టాకనే కష్టాలు ప్రారంభం అయాయి. కాస్త ఖర్చులు ఎక్కువయేటప్పటికి ఏదో పెద్ద కష్టం ముంచుకు వచ్చినట్టు చికాకు పడడం మొదలెట్టాడు భర్త. ఇంటికి జీతం మొత్తం వచ్చేది కాదు. ఎంత కాఫీ, సిగరెట్లు ఖర్చు అనుకున్నా మూడో జీవికి కూడా మనం బాధ్యులం అనుకోక పోతే ఎలా? పాప ఖర్చు మన ఖర్చు కాదా! ఈమాటే భర్తతో అన్నది. "నాకెన్నో వర్రీస్ ఉన్నాయి. నన్ను వేధించకు" అనేవాడు భర్త స్నేహితుడు ఒకతని ద్వారా తన భర్త మాదక ద్రవ్యాలకి అలవాటు పడ్డాడని తెలిసిన రోజు తను చితికి పోయింది. భగవంతుడు ఎందుకు తనని ఇలా పరీక్షిస్తున్నాడు? అన్ని ఖర్చులూ తగ్గించేసినా అప్పులు తప్పలేదు. పరిస్థితి ఎంతకి దిగ జారిందంటే ఇంట్లో గిన్నెలు, బొచ్చెలు, ఆఖరికి పాప బొమ్మల దగ్గరినించీ మాయమవసాగాయి. తన చీరలు కనిపించ కుండా పోయాయి. అన్నీ తన భర్త వ్యసనానికి ఆహుతి అయిపోయాయి. అనుకూలవతి అయిన భార్య, ముద్దులు మూట గట్టే పాప, నాలుగు రాళ్లు తెచ్చే ఉద్యోగం, అన్నీ ఉండి కూడా మానవుడు తప్పు దారి పడితే దానికి ఎవరు కారకులు? దారీ తెన్నూ తెలియని అగాధంలో పడి కొట్టుకుపోతున్నట్లుంది కామాక్షమ్మకి.

..... అరుణ తన మంచం మీదే నిద్రలోకి జారుకుంది. కూతురు, అల్లుడి కంఠాలు తారస్థాయిని చేరుకున్నాయి. వాళ్ల మాటలు తన గదిలోకి స్పష్టంగా వినబడుతున్నాయి. వద్దనుకున్నా వినక తప్పలేదు.

'పిల్లల్ని కన్నాక వాళ్ల ఆలనా పాలనా చూచుకోనక్కరలేదా?' అల్లుడు

నే నొక్కదాన్నే బాధ్యురాలనా! తండ్రిగా నువ్వేం చేస్తున్నావు దాని మంచి చెడ్డలు చూసే విషయంలో?' కరుణ. కరుణ స్వతంత్ర భావాలు గల ఆధునిక యువతి గనక భర్తను ఏకవచనంలోనే సంబోధించడం అలవాటు.

'నువ్వు ఉద్యోగాలుచేసి ఊళ్లేలుతూ ఉంటే నేనుదాన్ని చూసుకోవాలా?'

"అయినా మా అమ్మే దాన్ని చూసుకుంటోంది. నువ్వేం ఘనకార్యం చేస్తున్నట్టు?"

"ఆడదానివి కాబట్టి ఛాన్సులు నీకు ఎక్కువ వస్తున్నాయి. ఆ అహంభావమే నీకు తలకెక్కింది!"

"నీకు టాలెంట్ ఉంటే- అసలు నీ అహంభావం తగ్గించుకుంటే- నువ్వెప్పుడో పైకి వచ్చేవాడివి!"

"ఈ ఎత్తి పొడుపుల వల్లే పరిస్థితి ఇలా తగలడుతోంది!"

"నీ వ్యవసనాలకి, నీ లోపాలకి, పరిస్థితులను బ్లేమ్ చెయ్యక్కర లేదు.

నీ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ నిన్నిట్లా ఆడిస్తోందని ఒప్పుకో! "

"నే నెవరికీ ఏ సంజాయిషీ ఇవ్వక్కర లేదు. నా యిష్టం వచ్చినట్టు నేనుంటాను."

"నీ ఇష్టం వచ్చినట్టుండడానికి ఇది నీ ఇల్లుకాదు. నా సంపాదన మీదే ఇల్లు గడుస్తోందన్న సంగతి మరిచిపోకు!"

"పెళ్లైన కొత్తలో 'మన సంపాదన' ఇప్పుడు 'నీ సంపాదన అయిందా'?"

"అవును. ఎప్పటికీ నీ ప్రపయత్నం అనేది లేకపోతే పర్యవసానం ఇదే!"

"ఇంక చాలించు,. నాకు నిద్ర వస్తోంది."

"రోజూ నిద్రేగా, వేరే పనేముంది?"

విసురుగా తలుపు మూసింది కరుణ.

ఇలా వాగ్వివాదాలు జరగడం ఇది మొదటి సారి కాదు. అనేక సార్లు జరిగాయి. ఒక్కొక్కప్పుడు అల్లుడు చెయ్యి చేసుకోవడం కూడా జరిగేది. కామాక్షమ్మ ఎప్పుడైనా అడ్డుపడడానికి ప్రయత్నిస్తే 'ఇది మా పర్సనల్ విషయమమ్మా నువ్వు జోక్యంచేసుకోకు' అని కొట్టి పారేసేది కరుణ ఆమె మూగ ప్రేక్షకురాలుగా మనసులోనే రోదించడం తప్ప ఏమీ చెయ్యలేకపోయింది.

'భగవంతుడా! సమస్యలు సృష్టించేది నువ్వే. వాటిని పరిష్కరించేదీ నువ్వే. ఈ సమస్యకీ నువ్వే పరిష్కారం చూపాలి' కనబడని దేవుడితో మొర పెట్టుకుంది కామాక్షమ్మ.

ఇంతలో అరుణ లేచి తలగడ తీసుకుని "నాన్న దగ్గరికి వెడతా" అని బైలు దేరింది. ఎంతసేపు ఎవరి పక్కన పడుకున్నా చివరికి నాన్నకావాలి. పాపం ఆ పసిపాప వీళ్లిద్దరి మధ్యన నలిగి పోతోంది. దాని భవిష్యత్తు ఎలా ఉందో!

కళ్లెం పట్టుకు లాగినా మొరాయించే గుర్రంలాగా ఆలోచనలు కామాక్షమ్మను మళ్లీ గతంలోకి లాక్కెళ్లాయి.

..... ఆరోజు ఇంట్లో అన్ని వస్తువులూ నిండుకున్నాయి. చింకి చాపలు తప్ప అమ్మడానికి కూడా ఏమీ మిగల్లేదు, భర్త స్నేహితుడు ఆమె మీద సానుభూతితో వచ్చి చెప్పాడు. " మీ ఆయన అక్కడ రోడ్డు పక్కనే పడుకున్నాడమ్మా. లేపినా మత్తులో లేవలేదు. మత్తు వదిలాక అతనే ఇంటికి వస్తాడులే గాభరా పడవద్దు" అని చెప్పి వెళ్లి పోయాడు. భర్తని వెతికే ప్రయత్నం చెయ్యలేదు కామాక్షమ్మ. ఆమె సహనశక్తి పూర్తిగా నశించిపోయింది. ఇక అక్కడ ఉండడం అసంభవమని పిల్లతో, కట్టుబట్టలతో పుట్టింటికి వచ్చేసింది. వస్తూ తాళాలు ఇంటి వాళ్లకి ఇచ్చి "మావారు వస్తే ఇచ్చి ఇల్లు ఖాళీ చెయ్యమనండి" అని చెప్పింది.

ఆ తరువాత నిరంతర సంఘర్షణల మధ్య జీవితం ఎలా నడిచిందో ఒక పీడ కలలాగా మరచి పోదామనుకున్నా తనను ఆ జ్ఞాపకాలు వెంటాడుతూనే వచ్చాయి.....

కరుణకి కొన్ని నిర్దుష్ట అభిప్రాయాలున్నాయి. పన్నెండేళ్ల వయసుకే స్వతంత్రభావాలు అలవరుచుకుంది. తను నమ్మిన అభిప్రాయాల్ని ఎవరు చెప్పినా మార్చుకోదు. ఒకరోజు మధ్యాహ్నమే ఇంటికి వచ్చేసింది కరుణ.

"ఏమే ఇవాళ స్కూలు త్వరగా అయిపోయింది?" అడిగింది కామాక్షమ్మ.

"నాకు పీరియడ్స్ వచ్చాయి. అందుకని టీచరు దగ్గర పర్మిషన్ తీసుకుని వచ్చేశాను" అన్నది కరుణ

"పీరియడ్స్ రావడమేమిటి? అయిపోయాను."



చాంతిక్‌ను వాడిన తర్వాత తమ మేని రంగు కాంతివంతమైందని చాలామంది రాస్తున్నారు.

"చాంతిక్ నిజంగానే ఒక అద్భుతం" అంటున్నారు సునీత.

"మీ ఉత్పాదన - చాంతిక్ హెర్బల్ ఫేసియల్ టానిక్‌ను నేను క్రమం తప్పకుండా వాడుతుంటాను. గతంలో నా ముఖం మీద చాలా మొటిమలు వుండేవి. ఐతే, మీ ఫేస్ ప్యాక్‌ను వాడిన తర్వాత అవన్నీ అదృశ్యమయ్యాయి! నేను మామూలుగానే చాలా అందంగా వుంటాను. మీ ఉత్పాదనను ఉపయోగించిన తర్వాత విశేషమైన అందాన్ని సంతరించుకున్నాను. నా ఫ్రెండ్స్ అందరూ నీ సౌందర్య రహస్యం ఏమిటని నన్ను అడుగుతూ వుంటారు. వాళ్ళకు నేను యిచ్చే ఒకే ఒక సలహా - చాంతిక్‌ను వాడమని! నన్ను చూసిన తర్వాత నా కాలేజ్ ఫ్రెండ్స్ చాలామంది దీన్ని వాడడం ప్రారంభించారు.

చాంతిక్ నిజంగానే ఓ అద్భుతం! నేనీ ఫేస్ ప్యాక్‌ను వాడడం కొనసాగిస్తూ, దీన్నే ఉపయోగించవలసిందిగా అందరికీ సలహా యిస్తాను."

మీకు నా ధన్యవాదాలు

ఎ. సునీత

త్యాగరాయ రోడ్, మద్రాసు*

చాంతిక్ - ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలో శ్రేష్టమైన అన్ని షాపులలోనూ లభిస్తుంది. ధర: 50గ్రా॥ల జార్ రూ. 22/-, 100గ్రా.ల ప్యాక్: రూ 39/-, మీకు సమీపంలో ఉన్న షాప్ కోసం దిగువ పేర్కొన్న చిరునామా వద్ద సంప్రతించండి.

* ఈ ఉత్తరం ఆంగ్లంలో వ్రాయబడినది.

వర్మనా ప్రెడిషనల్ ప్రొడక్ట్స్

46, బజుల్లా రోడ్, టి. నగర్, మద్రాసు - 600017. ఫోన్: 8254790.

ఆంధ్రప్రదేశ్‌లోని మా దుకాణాలు (డీలర్: యువిక్ ఎంటర్ ప్రైజస్, సికింద్రాబాద్, ఫోన్: 801549)
• హైద్రాబాద్ మరియు సికింద్రాబాద్: అమర్ లేడీస్, కతియవార్, షీ-సిల్క్స్, నీలమ్ ఎంపోరియం, శ్రీ స్టోర్స్, కమల్ సావళ్లీ, సావళ్లీ బేంగిల్స్, నాగజ్యోతి బేంగిల్స్, ఆనందా బేంగిల్స్, జగదీష్ స్టోర్స్, శారద స్టోర్స్, విజయ్ ట్రేడర్స్, ఈవ్స్ ఎర్త్‌క్లూజివ్ • పాతబస్తీ: న్యూ సుల్తాన్ జరి హ్యాండ్స్, రతన్‌లాల్ బద్రీలాల్ బజార్ ఖాన్, పంచరంగి స్టోర్స్ • విశాఖపట్నం: కరాచీహాల్, నీలగిరీస్, విజయ్ మేరక, మేడమ్ ఛాయిస్, కెనరా స్టోర్స్, ధవళ మెడికల్స్ 12-4-24, అప్పర్ రోడ్ ఫోన్:65052 • కాకినాడ: బిల్లా స్టోర్స్, రాజు భవన్, సిమా కలెక్షన్స్, A టు Z ఎంపోరియం • రాజమండ్రి: లక్ష్మి ఎంపోరియం, బాంబే డ్రెస్సెస్, ఎరుకొండ ఫ్యాన్సీ, బి.ఎస్.ఆర్. గామిని & సన్స్

Anugrah 2331/96 Mal

"నీకేం తెలియదమ్మా, పీరియడ్స్ అంటే క్లాస్ పీరియడ్స్ కాదు. మెన్సెస్ అన్నమాట. అవును గానీ నీ చిన్నప్పటిలాగా దండోరా వేసి ఊరందరినీ పిలిచి గోల చెయ్యకు. నా కసహ్యం. అందరికీ సహజంగా జరిగేదానికి సెలిబ్రేషన్ ఏమిటి? నేను శానిటరీ టవల్స్ తెచ్చుకోడానికి బజారుకి వెళ్తున్నాను' అని జవాబుకి ఎదురు చూడకుండా వెళ్లి పోయింది.

'నీకేం తెలియదమ్మా' అన్న వాక్యం జీవిత మంతా తనను వెంటాడుతూనే ఉంది. నిజంగానే తనకేం తెలీదా? లేక తనకి తెలిసినవి కేవలం అతి అల్పమైన విషయాలా? లేదా తన అభిప్రాయాలతో ఇతరులు ఏకీభవించడం లేదా? ఏదైతేనేం, తనని ఒక అసమర్థురాలుగా ప్రపంచం జమకట్టింది.

ఈ ఆలోచనలతో తెల్లవారింది. యథావిధిగా వంటపని, ఇంటిపని అరుణని స్కూలులో దిగబెట్టడం, మళ్లీ పిలుచుకు రావడం వీటితో సాయంత్రం దాకా గడిచి పోయింది. ఇవాళ సాయంత్రం పాటకచేరీ ఉంది కనక ఓ గంట ముందుగా వచ్చేసింది కరుణ ఆఫీసునుంచి. అల్లుడు ఇంకా పడకమీదే పడుకుని అరుణతో ఆడుకుంటున్నాడు. సాధారణంగా సాయంత్రం లేచి స్నానపానాదులు ముగించుకుని బైటికి వెళ్లి ఏ రాత్రి కోగాని రాడు. వచ్చాక మళ్లీ మహాభారతం మొదలు. అర్ధరాత్రి దాకా సాగుతుంది అది. ఇవాళ పాటకచేరీ నించి కరుణ రాగానే ప్రహసనం మొదలువుతుంది. అనుకోగానే ఒళ్లు జలదరించింది కామాక్షమ్మకి.

ఆఫీసునించి వస్తూనే అరుణకేదైనా కొనుక్కు రావడం కరుణకి అలవాటు. ఏదో అపరాధ భావం పీడిస్తుంది కాబోలు, తల్లిగా తన ధర్మం నిర్వర్తించ లేక పోతోందేమో అని, ఆ లోటు భర్తీ చెయ్యడాని కన్నట్టు చాక్‌లెట్లూ, బిస్కట్లూ, బొమ్మలూ తెస్తుంది.

"పాపా ఇదిగో నీకు చాక్‌లెట్" అని బ్యాగ్ తీసింది కరుణ. "డాడీ నాకు కొనిచ్చారులే. ఆట అవనీ తరవాత వచ్చి తీసుకుంటా" అని మళ్లీ ఆటలో మునిగిపోయింది అరుణ. అరుణ అమాయకంగా అన్నమాట కరుణకి ముల్లు గుచ్చుకున్నట్టయింది.



భార్యాభర్తల మధ్య మంట రేగడానికి ఇలాంటి చిన్ని నిప్పురవ్వలు చాలు.

'ఏం నేను చాక్‌లెట్ ఇస్తే నీకు పనికిరాదా?'

తనను కించపరచడానికే కొనిచ్చాడు చాక్‌లెట్ -తనకీ ఆమాత్రం స్తోమత ఉందని చాటించు కోడానికి అనుకున్నది కరుణ.

అతను అందుకున్నాడు.

'రోజంతా నువ్వే ఇంట్లో ఉంటున్నావా? నేనే కొనిచ్చాను తప్పేముంది?' ఎవరూ ఎవరికీ తీసిపోరు. హనుమంతుడి తోకలాగా మాటలు పెరిగాయి.

"ఇవాళ కచేరీ ఉంది కదమ్మా! మూడ్ పాడుచేసుకోకు" అని కామాక్షమ్మ ఏదో చెప్పబోయింది.

"అవును. అక్కడైతే అడ్డమైన కుక్క వెధవలూ తోకాడించుకుంటూ వచ్చి దీని పాట విని ఆహా ఓహో అని మెచ్చుకుంటే అప్పటికి జన్మ తరించిపోతుంది. దీనికి ఇల్లూ, వాకిలీ, సంసారం అక్కరలేదు' అన్నాడు విసురుగా అల్లుడు.

'కుక్క వెధవల కోసం నేను పాటకచేరీ చెయ్యడం లేదు. నీ విలాసాలకీ వ్యాపకాలకీ సంపాదించి పోసేది నేనే. మాటలు తిన్నగా రానియ్యి' అని అరిచింది కరుణ.

సాచి చెంప దెబ్బ కొట్టాడు అల్లుడు. అంతో ఇంతో ఉన్న బంధం పూర్తిగా తెగిపోయింది. ఆ దెబ్బతో - వారిద్దరి మధ్యా, ఆ రోజు కచేరీకి వెళ్లి వచ్చాక మర్నాడే విడాకుల కోసం లాయర్ని సంప్రదించడానికి వెళ్లింది కరుణ.

. . . .తన చిన్ననాడు విడాకులు అన్నమాట ఉచ్చరిస్తేనే పాపం అనుకునేవాళ్లు. పసుపు కుంకుమలతో ఉన్న స్త్రీకి ఇచ్చిన గౌరవం విడాకులు ఇచ్చిన స్త్రీకి ఇచ్చేది కాదు సమాజం. కాలం మారిపోయింది. ఇప్పుడు అవన్నీ ఎవరూ పట్టించుకోరేమో! కరుణ వివాహం నిలబెట్టడానికి తను ఏం చెయ్యాలి, ఏం చెయ్యగలదు? విడాకులు ఏ పరిణామానికి దారి తీస్తాయో, అరుణ గతి ఏమౌతుంది? అరుణకి తండ్రి అంటే ప్రాణం, తల్లి అంటే గౌరవం, భయం. మరి పసిపిల్ల ఎవరి దగ్గర ఉంటుంది? తండ్రి మీద ఎంత ప్రేమ ఉన్నా తల్లి రాగానే బుద్ధిమంతురాలిలాగా పాఠాలు చదువుకోడం, వేళకి తిండితిని నిద్ర పోవడం అన్నీ చకచకా జరిగిపోతాయి. అరుణ సంపూర్ణ వికాసానికి తల్లితండ్రులు ఇద్దరి అండదండలూ అవసరమేనని కామాక్షమ్మ గ్రహించింది.

విడాకులు నివారించడానికి తన తరపున గట్టి వాదాలు ఏమీలేదు అల్లుడికి. పైగా కరుణ కూతురిని విడిచిపెట్టి ఉండలేదు కనక తప్పని సరిగా కలిసి ఉండే ప్రయత్నమే చేస్తుంది. ఒక వేళ విడిపోవలసి వస్తే ఐదు సంవత్సరాలు పైబడ్డ సంతానం తండ్రితోనే ఉండాలని కోర్టు శాసిస్తుంది. కనక కరుణకి కూతురు కావాలంటే తను కూడా కూతురితోనే ఉండక తప్పదు. ఇదంతా తనను బెదిరించడానికే అని అనుకుంటున్నాడు అని కామాక్షమ్మ నమ్మకం.

కోర్టు విచారణ జరిగే రోజు రానే వచ్చింది. ఈ మధ్య కాలంలో భార్యా భర్తల మధ్య మాటలు బాగా తగ్గి పోయాయి. కరుణకి కూడా తెలుసు అరుణకి తల్లి తండ్రుల అవసరం ఎటు వంటిదోగాని పరిస్థితి చెయ్యి దాటి పోయింది. తను పొరపాటు చేసిందా? తొందర పడిందా? ఈ నరకంలో నుంచి బైట పడక పోతే తన భవిష్యత్తు ఏం కాను? మరి అరుణ భవిష్యత్తు ఏమిటి? ఈ వాతావరణంలో అరుణ ఎలా పెరుగుతుంది.?

కామాక్షమ్మ విడాకులు రద్దు చేసుకోమని కరుణకి చెప్పి చూసింది.

'నీ కాలంలో లాగా విడాకులంటే భయపడుతూ రోజుకి పది చావులు చస్తూ బతకను నేను. నా కాళ్లమీద నిలబడగల శక్తి నా కున్నప్పుడు నేనెవరికి భయపడాలి? మాట లెందుకు పడాలి?' కరుణ కంఠంలో స్థిర నిశ్చయం ధ్వనించింది.

భార్యాభర్తలిద్దరూ కోర్టులో హాజరయ్యారు. జడ్జిగారు అరుణని కూడా కోర్టుకి తీసుకురావలసిందిగా ఆజ్ఞాపించారు. ఇదే మొదటిసారి కోర్టుని చూడడం-కామాక్షమ్మకి ముచ్చెమటలు పోశాయి. కాని కూతురూ, అల్లుడూ ఆఖరికి అరుణకూడా ఏమీ చలించకుండా హాయిగా వచ్చారు కోర్టుకి.

'అమ్మమ్మా మనం సినిమాలో చూసినట్టే ఉంది కదూ కోర్టు?' అన్నది సరదాగా అరుణ. ఆందోళన, ఆదుర్దా, ఆవేదన కామాక్షమ్మ హృదయాన్ని పిండివేస్తున్నాయి. భగవాన్, ఏమిటీ అగ్ని పరీక్ష? చరిత్ర పునరావృతం అవుతుందా? తన కాపురం కూలిపోయినట్టే కరుణ జీవితంకూడా మోడు వారుతుందా? తను పిరికిపంద గాని కరుణ గుండె నిబ్బరం గలది, సాహసి, ఎటువంటి సమస్యలనైనా ఎదుర్కొనగల ధైర్యంగలది అన్న నమ్మకం కొంత ఊరట కలిగించింది కామాక్షమ్మకి. తను బ్రతికున్నంత కాలం కూతురు, మనవరాళ్ల బాగోగులు చూచుకుంటుంది. ఆ తరువాత నారు పోసినవాడు నీరు పోయడా? తానేమి శాశ్వతం? ఎవరు మాత్రం శాశ్వతం ఆ మాటకొస్తే! ఈ మధ్య కూతురూ అల్లుడూ ఇద్దరిలోను కొంత పరివర్తన కనిపించింది. ఈ విడాకుల కేసు మొదలు పెట్టాక వాగ్వివాదాలు తగ్గాయి. అరుణ మీద ప్రేమ,. ఆప్యాయత, పోటీపడి కురిపిస్తున్నారు. ఒకరిలో మరొకరు లోటులు మరీమరీ వెతికి ఎత్తి పొడవడం మానేశారు. ఇంట్లో అసాధారణ శాంతి నెలకొన్నది- తుఫాను ముందు నిశ్చలతలాగా,

"అమ్మమ్మా పలకవేం?" అరుణ ఊపడంతో కామాక్షమ్మ ఈ లోకంలోకి వచ్చిపడింది.

కరుణ లాయరు విడాకులకు కారణాలు వివరించారు. 'వీరిది ప్రేమ వివాహమయినా పరస్పరం భిన్నాభిప్రాయాలు కలవారని తెలుసుకున్నాక వారి దాంపత్యంలో కలతలు చెలరేగాయి. సహజీవనానికి దోహదమయ్యే అవగాహన వీరిలో లోపించింది. నా క్లయింట్ సంపాదన మీదే కుటుంబం నడుస్తుందన్న విషయం, క్లయింట్ భర్తలో ఆత్మన్యూనతా భావం కలుగజేసి తత్ఫలితంగా ఆమెను హింసించడం - అంటే సూటిపోటి మాటలనడం, చెయ్యి చేసుకోవడం-ఇటువంటి పరిస్థితిలో ఆమెకూ, కూతురికీ కూడా మానసిక వ్యథను కలుగచేస్తున్నాయి"!



లాయర్ ఇంకా కొంత వారి జీవిత విధానం వివరించి, చివరికి "మైలార్డ్ పై చెప్పిన కారణాల వల్ల నా క్లయింట్‌కు విడాకులు మంజూరు చేసి కూతురి కస్టడీ నా క్లయింటుకే ఇమ్మని ప్రార్థిస్తున్నాను' అని ముగించాడు.

అల్లుడి తరపు లాయర్ ప్రతివాదాలేవీ తీసుకురాలేదు. జడ్జిగారు చెప్పారు. 'ఐదు సంవత్సరాలు నిండిన సంతానం తండ్రి అజమాయిషీలోనే ఉండాలి గాని ఈ కాలం పిల్లలు వాళ్ల అభిప్రాయాలను, వారి ఆశలు, ఆశయాలను విశదంగా చెప్పగలిగిన తెలివి తేటలు గలవాళ్లు కాబట్టి మీ క్లయింట్ సంతానాన్ని పిలిపించి, ఆ పాప ఉద్దేశ్యం తెలుసుకోడం అవసరం.' అరుణ లేచింది. చకచకా వెళ్లి బోనులో నిలబడింది. కోర్టులో అంతా ఆశ్చర్యంగా అరుణవంకే చూస్తున్నారు.

అరుణ చిన్ని చేతులు జోడించి 'జడ్జీగారూ నమస్తే' అన్నది ముద్దుగా. ఆయన చిరునవ్వు నవ్వి 'నమస్తే' అన్నారు.

"జడ్జీగారూ, నేను మిమ్మల్ని ఏదైనా అడిగితే మీకు కోపం రాదుకదా! ఆ సుత్తితో బల్లమీద కొట్టి 'సైలెన్స్' అనరుకదా" అన్నది అరుణ.

కోర్టులో ముసి ముసి నవ్వులు,

"లేదమ్మా. భయపడకుండా అడుగు."

"జడ్జీగారూ, దేవుడు మీకు రెండు కళ్లు ఇచ్చాడు కదా!"

"అవునమ్మా. నాకేమిటి - అందరికీ రెండు కళ్లు ఇస్తాడు దేవుడు."

"మరి మీకు ఏ కన్ను ఎక్కువ ఇష్టం? కుడి కన్నా, ఎడమ కన్నా?"

"అదేమిటమ్మా! నాకు రెండు కళ్లూ ఇష్టమే. రెండూ అవసరమే. ఎందుకంటే రెండు కళ్లతోనైతేనే మనం బాగా సరిగ్గా చూడగలం దేన్నైనా!"

'అవునామరి? నాకు అమ్మ ఎక్కువ ఇష్టమా, నాన్న ఎక్కువ ఇష్టమా, ఎవరు కావాలి అని అడిగారు కదా లాయరు గారు? నాకు నాన్నా, అమ్మా ఇద్దరూ కావాలి రెండుకళ్ల లాగా. ఇద్దరూ నాతో ఉంటేనే నాకు బాగుంటుంది. ఏ ఒక్కరినీ విడిచి నేనుండలేను" అరుణ మాటలు విన్న కరుణా, ఆమె భర్తా స్తంభించిపోయారు. జడ్జీగారు అన్నారు.

"ఒక జీవి ఈ ప్రపంచంలోకి రావడానికి భార్యాభర్తలిద్దరూ బాధ్యులు. తల్లిగాని తండ్రిగాని లేని దురదృష్టవంతులకి తప్ప ప్రేమ, ఆప్యాయత, అనురాగం తల్లిదండ్రుల నించి పొందేహక్కుని పిల్లల నించి దోచుకోడానికి జన్మ నిచ్చిన తల్లి తండ్రుల క్కూడా అధికారం లేదు. అలా చెయ్యలేని పక్షంలో సంతానం కలుగ కుండా ముందే జాగ్రత్త పడడం మంచిది. పిల్లల మానసిక ఆరోగ్యానికి, సంపూర్ణ వికాసానికి తల్లిదండ్రులిద్దరూ కలిసి శ్రమించాలి. ఆ ప్రయత్నంలో వారి వారి పురోగతికి కొంత అవరోధం కలిగినా, వారి స్వార్థం కొంత వదులు కొనక తప్పదు. తల్లి దండ్రులిద్దరూ కలిసి కట్టుగా వారి పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా మలిచి వారిని ఒక సంపూర్ణ వ్యక్తిగా నిల బెట్టాలంటే, భార్యా భర్తలు చాలా విషయాలలో రాజీపడాలి. ముఖ్యంగా వారి వారి వ్యక్తిత్వాలు- ఒకరితో ఒకరు ఎడ్జస్ట్ అవగలగాలి. పిల్లలకి ఇల్లంటే సురక్షితమైన వాతావరణం అనే నమ్మకం కలిగించాలి. ఇవన్నీ ఇద్దరి సహకారం, పరస్పర అవగాహన ఉంటేనే సాధ్యం. ఈ పాప స్పష్టంగా చెప్పింది-తల్లిదండ్రు లిద్దరూ ఉంటేగాని తనకి సంతోషంగా ఉండదని! అది జీవన సత్యం. కాబట్టి పై విషయాలు మనసులో ఉంచుకుని భార్యాభర్త లిద్దరూ వారి వారి విభేదాలను పక్కకు నెట్టి వారి దాంపత్య జీవితం- ముఖ్యంగా ఆ పాపకోసం- సజావుగా సాగడానికి మరొక అవకాశం వినియోగించి, అది సఫల మవకపోతే తప్ప విడాకుల ప్రయత్నం ప్రస్తుతానికి విరమించుకుంటే మంచిదని అభిప్రాయ పడుతూ కేసును వాయిదా వేయడ మయినది.

అరుణ బోను దిగి తల్లి తండ్రు లిద్దరినీ చెరో చెయ్యీ పట్టుకుని లాక్కుని కామాక్షమ్మ దగ్గరికి వచ్చింది. " రా అమ్మమ్మా, ఇంటికి పోదాం "అన్నది సంతోషంగా. కామాక్షమ్మ ముఖం వెలిగి పోయింది. కరుణా, అల్లుడూ కొత్త అర్థంతో, కొత్త అవగాహనతో ఒకర్నొకరు చూచుకున్నారు.

●